
గంభీరావుపేట మండలం నర్మాలలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్


గంభీరావుపేట మండలకేంద్రంలో మొదటి సారి ఓటు వేసిన ఆనందోత్సవంలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు


ఇల్లంతకుంట : గాలిపెల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర ఆహార భద్రత కమిటీ సభ్యుడు ఓరుగంటి ఆనంద్, కుటుంబసభ్యులు

# 78.43% పోలింగ్

- వేములవాడ నియోజకవర్గంలో ప్రశాంతంగా పోలింగ్
- పలు చోట్ల 5 గంటలు దాటిన కూడా పోలింగ్

వేములవాడ రూరల్, నవంబర్ 30: వేములవాడ, వేములవాడ రూరల్ మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీ నాయకుల హంగామా కనబడింది. ఓటు వేసేందుకు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చారు. రుద్రవరంలో 95 ఏళ్ల వృద్ధురాలు లక్ష్మీ తన ఓటు హక్కును వినియోగించుకుంది. మాజీ ఎమ్మెల్యే రేగులపాటి పాపారావు తన ఓటు హక్కును రుద్రవరంలో వినియోగించుకున్నాడు. వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఓటు వేసేందుకు వీల్ చేర్ సౌకర్యంతో పాటు సిబ్బందిని నియమించటంతో ఇబ్బందులు తప్పాయి. పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉత్సహాంగా కనబడటంతో పాట కారుగుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పోలింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్ అనుమతి లేకపోవడంతో బయటనే సెల్‌ఫోన్‌లు ఉంచి ఓటు వేసేందుకు వెళ్లారు. తిప్పాపూర్, నాంపెల్లి తదితర గ్రామల్లో 5 గంటల వరకు కూడ క్యూలైన్‌లో ఓటర్లు నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రశాంతమైన వాతవారణంలో పోలింగ్ జరగటంతో పోలీసులు ఊపిరిపిల్చుకున్నారు. కాగా డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ మారుతి ఆధ్వర్యంలో పోలీస్ బంద్‌బస్త్ నిర్వహించటంతో పాటు పెంట్రోలింగ్ వాహనలు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

రుద్రంగి, నవంబర్ 30: రుద్రంగి మండల కేంద్రంలో డీఎస్పీ నాగేంద్రాచారి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత బలగాల మధ్య ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 8288 ఓటర్లుండగా 7 బూత్‌లలో 6205 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 74.86 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహరావు మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎంపీపీ గంగం స్వరూపారాణి, జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, సర్పంచ్ తర్రె ప్రభలత ఓటు హక్కును వినియోగించుకున్నారు


రుద్రంగిలో ఓటు వేసేందుకు వృద్ధుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తున్న ఎస్ఐ

కోనరావుపేట, నవంబర్ 30: మండల వ్యాప్తంగా ఉదయం పోలింగ్ ప్రారంభమైన సమయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు క్యూలో బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు ప్రధానంగా దివ్యాంగులకు వీల్‌సైకిళ్లు ఏర్పాటు చేసి ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు, వైద్యసిబ్బంది ఓటర్లకు తమ సేవలను అందించారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు సమస్యాత్మకమైన కేంద్రాల వద్ద పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించారు. ఎస్ఐ ఆంజనేయులు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అనునిత్యం పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేశారు. మండలంలో 16803మంది పురుషులు, 17447మంది మహిళలు మొత్తంగా 34250 మంది ఓటర్లు ఉన్నారు.


రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన మహిళలు

## స్వగ్రామంలో ఓటేసిన ప్రముఖులు

కోనరావుపేట, నవంబర్ 30: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలువురు ప్రముఖులు తమ స్వగ్రామంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. మల్కపేటలోని జానకీదేవి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో పాటు కుటుంబసభ్యులు సునీల, నివేదిత, నిహారిక, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్, కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, మాజీ న్యాయశాఖ మంత్రి చల్మెడ ఆనందరావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామన్నపేటలో జడ్పీ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ, రాఘవరెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు, కొలనూర్‌లో డీపీఆర్వో మామిండ్ల దశరథం, మల్కపేట ఎంపీపీ చంద్రయ్యగౌడ్ తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## మొరాయించిన ఈవీఎంలు

వీర్నపల్లి, నవంబర్30: మండలంలోని కంచర్ల, వన్‌పల్లిలో ఉదయం ముప్పై నిమిషాల పాటు ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ అలస్యంగా మొదలైంది. బావుసింగ్‌నాయక్ తండా పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ఏజెంట్ వివరాలు సరిగా లేకపోవడంతో ఎన్నికల అధికారులు బయటకు పంపించారు. ఎస్ఐ నవత ఇరు పార్టీల నాయకులను అక్కడి నుంచి పంపించి వేశారు. వన్‌పల్లి పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు వరుస సంఖ్యలో లేకపోవడంతో గ్రామస్తులు అందోళన చేశారు. దీంతో పోలింగ్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న సెక్టార్ అధికారి నరేశ్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది సరిచేయడంతో తిరిగి పోలింగ్ ప్రారంభమైంది. రంగంపేట, బావుసింగ్‌నాయక్‌తండా, లాల్‌సింగ్‌తండా, గర్జనపల్లి పోలింగ్ కేంద్రాలను ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండస్వామి పరిశీలించారు. పలువురు మహిళలు చిన్నారులతో క్యూ లైన్‌లో వేచి ఉండడాన్ని గమనించిన ఆయన వారికి ప్రాధన్యమివ్వాలని సిబ్బందికి సూచించారు.

# బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- కేసీఆర్ సర్కారు పథకాలను చూసి ఓటర్లు ఆదరించారు
- ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా
- మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

మంథని/ మంథని రూరల్, నవంబర్ 30: 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయ ని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక రాజగృహలో గురువారం డాక్టర్ అంబేద్కర్, ఆయన తల్లి పుట్ట లింగమ్మ ప్రతిమలు, చిత్రపటాలకు నివాళులర్పించగా పుట్ట మధూకర్‌కు పుట్ట శైలజ కంకణం కట్టారు. సుందిళ్లలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంథని మండలం వెంకటాపూర్ లోని పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ ప్రవేశ పెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలంతా సీఎం కేసీఆర్ సర్కారునే కోరుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్‌కు స్పష్టమైన అధిక్యం కనిపించిందన్నారు. గెలిచిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ అమ లు చేస్తామని ప్రకటించారు. ఉదయం నుంచి సాయంత్రం నియోజవర్గంలో కలియదిరిగారు. రామగిరి మండలం సుందిళ్ల, మంథని ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ఐదు పోలింగ్ కేంద్రాలు, కాటారం మండలం దేవరాంపల్లి, గారెపల్లి, మహాముత్తారం మండలంలోని యామన్‌పల్లి, మహాముత్తారం, ములుగులపల్లి, మహదేవపూర్, కమాన్‌పూర్, రామగిరి మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను పుట్ట మధూకర్ సందర్శించారు. ఓటింగ్ సరళిపై ఆరా తీశారు.

# కేసీఆర్ పాలనపై సంపూర్ణ విశ్వాసం

**అసెంబ్లీ ఎన్నికల్లో కొనసాగిన బీఆర్ఎస్ హవా**

**ధర్మపురి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్**

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 30: దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోలింగ్‌లో బీఆర్ఎస్ హవా కొనసాగిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఏవరు ఎన్ని జిమ్మికులు చేసిన ఆరు పథకాలు పేరిట ప్రజలను మభ్యపెట్టిన ప్రజలు కేసీఆర్‌పై సంపూర్ణ విశ్వాసంతో ఓట్లు వేసినట్లు తెలిపారు. ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలని నూతన ప్రణాళికలతో కొత్త హామిలను ఎజెండాతో ఈ ఎన్నికలకు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని మూడు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందనున్నట్లు తెలిపారు. ఇక్కడ రామగుండం బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్, మేయర్ అనిల్‌కుమార్, బీఆర్ఎస్ నాయకురాలు మూల విజయారెడ్డి ఉన్నారు.

# అభివృద్ధిని చూసి ఆదరించారు

- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి, నవంబర్30: పెద్దపల్లి నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను చూసే ఓటర్లు ఆదరించారని పెద్దపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని ఇండియన్ మిషన్ హై స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఆయన సతీమణి దాసరి పుష్పలతారెడ్డి, కొడుకు దాసరి ప్రశాంత్‌రెడ్డి, కొడలు పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి తమ ఓటు హక్కును వినయోగించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తనకు ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ హవా కొనసాగిందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ పథకాలకు ప్రజలు ఓటుతో మద్దతు తెలిపారని చెప్పారు. పెద్దపల్లి నుంచి తాను తప్పకుండా విజయం సాధిస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని పేర్కొన్నారు.